క్లుప్తంగా

ఘనంగా అంకాలమ్మ ప్రతిష్ట వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మైదుకూరు : మైదుకూరులోని గ్రామ దేవత శ్రీఅంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వనిపెంట రోడ్డులోని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలను నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. ఆలయంలోని అంకాలమ్మ తల్లి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం చేశారు.

సబ్‌జైలు సందర్శన

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ బాబాఫక్రుద్దీన్ గురువారం సందర్శించారు. ఇందులో భాగంగా జైలు పరిసరాలు, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అట్లూరు : విద్య సంస్కారాన్ని నేర్పితే యోగా ఆరోగ్యాన్ని పదిలం చేస్తుందని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు యోగా, వ్యాసరచన పోటీలు, జాతీయ గీతం ఆలాపన తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జిరాఫీ చెస్ పోటీలు



జిరాఫీ చెస్ ఆడుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తినారాయణాచార్యుల ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన జిరాఫీ చెస్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాయలసీమ వ్యాయమ విద్య కళాశాల లైబ్రేరియన్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోచ్‌లు రాజా, దస్తగిరి జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించారు. చాడా మునిరెడ్డి సుమతి శతకం పద్యాలు చదివి భావం వివరించారు. స్పోకెన్ ఇంగ్లిషు మాస్టర్ పవన్‌కళ్యాణ్ ఆంగ్లంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి తిరుపతమ్మ, హెల్పర్ నాగ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వేసవి శిక్షణకు విశేష స్పందన



రాజుపాళెం గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రాజుపాళెం : వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన వస్తున్నట్లు రాజుపాళెం గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు పేర్కొన్నారు. ఆ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులు పుస్తకాలు, కథలు చదవడం, పద్యాలు చెప్పడం, క్యారమ్స్, చెస్ ఆడటం వంటి కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ఈ వేసవి శిక్షణా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యా హక్కు చట్టాన్ని లెక్కచేయకుండా నడుస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.

నే ఆడితే లోకమే ఆడదా..

- భరతనాట్యం, కూచిపూడిలో శిక్షణ
- విద్యార్థుల ఆసక్తి
- వేసవి సెలవులు చక్కగా వినియోగం



నాట్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



గీతాశ్రమంలో నృత్యంపై శిక్షణ ఇస్తున్న గురువు మొహిద్దీన్‌ఖాన్

ప్రొద్దుటూరు కల్చరల్ : వేసవి సెలవులను ఆనందోత్సాహాలతో గడపటంతోపాటు తమకు నచ్చిన వాటిలో రాణించేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. తమకు ఇష్టమైన వాటిలో శిక్షణ పొందేందుకు సమ్మర్ హాలీ డేస్‌ను ఉపయోగించుకుంటున్నారు.

సంప్రదాయ నృత్యం నేర్చుకుని అందులో రాణించేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని నటరాజ కళాక్షేత్రం, గీతాశ్రమంలో విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలలో శిక్షణ పొందుతున్నారు. గీతాశ్రమంలో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు, లైటుపాళెం సెంటర్‌లోని ఎంపీఎస్ ధ్యాన మందిరంలో సాయంత్రం 4.30 నుంచి 6.30 వరకు, నటరాజ కళాక్షేత్రంలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పలువురు చిన్నారులు నృత్యం నేర్చుకుంటున్నారు. ఆయా నృత్యాల ప్రాథమిక అడుగులు, జతులు, నృత్యాంశాలలో నాట్యగురువుల వద్ద ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. ఈ సంప్రదాయ నృత్యాలను నేర్చుకునేందుకు 5 ఏళ్ల చిన్నారుల నుంచి డిగ్రీ, బీటెక్ చదివే విద్యార్థులు ఆసక్తి కనపరుస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు వేసవి సెలవుల్లో ఏదో ఒక అంశంలో రాణించేలా శిక్షణ ఇప్పిస్తున్నారు. నృత్యంలో రాణించి మంచి నాట్యకారులుగా పేరుతెచ్చుకుంటామని చిన్నారులు చెబుతున్నారు. కొందరు సెలవుల వరకు మాత్రమే నేర్చుకోవాలి అనుకుంటుండగా కొందరు విద్యార్థులు మాత్రం నృత్యాంశాలలో సర్టిఫికెట్ కోర్సులను చేస్తామని చెబుతున్నారు.

సంప్రదాయ నృత్యాలపై ఆసక్తి



ఇటీవలి కాలంలో సంప్రదాయ నృత్యాలైన భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలను నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి కనపరుస్తున్నారు. వేసవిలో సెలవుల్లో తమకున్న సమయాన్ని ఉపయోగించుకుంటూ వీటిలో రాణించేలా శిక్షణ పొందుతున్నారు.

– నాట్యవిశారద మొహిద్దీన్‌ఖాన్, నాట్యగురువు, నటరాజకళాక్షేత్రం

కూచిపూడిలో ఎంఏ చేస్తున్నాను



నాట్యంపై ఆసక్తితో గత 20 ఏళ్లుగా భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలలో శిక్షణ పొందుతున్నాను. పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, రాణించాను. ట్రిపుల్ ఐటీలో గెస్ట్ డాన్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నాను. అలాగే కూచిపూడి నాట్యంలో ఎంఏ కోర్సు చేస్తున్నాను.

– సాయి పావని, నృత్యకారిణి

నాట్యంలో రాణిస్తా



నాకు చిన్నప్పటి నుంచి నాట్యం అంటే చాలా ఇష్టం. మా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. సమ్మర్ కోచింగ్ శిక్షణ శిబిరంలో నాట్యం నేర్చుకుంటున్నాను. నాట్యగురువు మెలకువలు నేర్పిస్తున్నారు. నాట్యంలో రాణించేందుకు కృషి చేస్తాను. వేసవి సెలవులను చక్కగా వినియోగించుకుంటున్నాను.

–శ్వేత, విద్యార్థిని

ఏఐఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన



పేస్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌యూ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎటువంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న పేస్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆల్‌ఇండియా స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్ పేర్కొన్నారు. గురువారం ఆ కళాశాల వద్ద ఏఐఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేస్ కళాశాలకు ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి అనుమతి రాకపోయినా అడ్మిషన్లు చేపట్టి విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఐఐటీ, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్, మెడికల్ శిక్షణ పేరుతో విద్యార్థులను చేర్చుకుంటున్నారని తెలిపారు. కళాశాల భవనం కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదని, విద్యార్థులకు సరైన వసతులు కల్పించలేదన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు అనుమతి రాకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా ఆర్‌ఐఓ స్పందించి అనుమతి లేని పేస్ కళాశాలను సీజ్ చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు బాలయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓలు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారాన్ని రుచిగా, శుభ్రంగా అందించాలని తెలిపారు. అనంతరం మెను ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేసే విధానాన్ని వీడియో ద్వారా చూపించారు. వంట పరిసరాలు, పాత్రలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం వంట నిర్వహణపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు సి.వెంకటరెడ్డి, ఎన్.శివారెడ్డి, సీసీహెచ్ శిక్షకులు లక్ష్మి, సీఆర్‌పీలు సత్తార్‌బాషా, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



ఎగువ రామాపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఐ నాగమురళి

కలసపాడు : ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ నాగమురళి, పోరుమామిళ్ళ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎగువ రామాపురం, ఎగువ తంబళ్ళపల్లె గ్రామాల్లో నాకాబంది, కవాతు, గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు వరకు గానీ, కౌంటింగ్ రోజు గానీ, కౌంటింగ్ తదుపరి రోజుల్లో గానీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వరాదన్నారు. అనుమతి లేకుండా అక్రమ మద్యం, మందుగుండు సామగ్రి, ఫైర్‌క్రాకర్స్ లాంటి వాటిని వారి వద్ద ఉంచుకోవడం గానీ, విక్రయించడం గానీ చేసిన పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా సమస్యల జోలికి వెళ్లినా లేదా సమస్యలు సృష్టించినా వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కనుక ప్రజలందరూ సమన్వయం పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

స్వచ్ఛందంగా బీసీజీ టీకా వేయించుకోవాలి



బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : అర్హత కలిగిన వారందరూ స్వచ్ఛందంగా వయోజన బీసీజీ టీకాను వేయించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ బి.రాజారత్నం తెలిపారు. గురువారం బీసీజీ కేంద్రాలను టీబీ సూపర్‌వైజర్ రాజారత్నం, హెచ్‌వీ సిద్ధార్‌రెడ్డి, సీఓ సుబ్బారెడ్డి పరిశీలించారు. టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను వారు ప్రజలకు అవగాహన కల్పించారు. బీసీజీ టీకాను 60 ఏళ్లపైబడిన వారు, సిగరెట్, బీడీ తాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, పాత టీబీ పేషెంట్స్, వారి ఇంటి సభ్యులు తప్పకు వేయించుకోవాలని సూచించారు. ప్రతి గురువారం బీసీజీ టీకాలు వేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 6వ సచివాలయం పరిధిలో 146 మందికి బీసీజీ టీకా వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మరమ్మతు పనులు



బస్టాండులో మరమ్మతు పనులు ప్రారంభించిన దృశ్యం

బద్వేలు అర్బన్ : పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ బస్టాండుకు ఎట్టకేలకు మరమ్మతులు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. స్థానిక సిద్ధవటం రోడ్డులో సుమారు 40 ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండును నిర్మించారు. బస్టాండు శిథిలావస్థకు చేరి స్లాబు పూర్తిగా దెబ్బతిని పైపెచ్చులు ఊడి పడుతుండటంతో ఇటీవల ఓ ప్రయాణికురాలు గాయపడింది. దీంతో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బస్టాండు పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఇటీవల బస్టాండును పరిశీలించిన ఆర్టీసీ సివిల్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ మేరకు సుమారు రూ.20 లక్షల వ్యయంతో శిథిలావస్థకు చేరిన రైలింగ్ తొలగించి రేకులు వేయడంతోపాటు దెబ్బతిన్న స్లాబును తొలగించి తాత్కాలిక మరమ్మతులు చేయనున్నారు. ఆ పనులను గురువారం నుంచి ప్రారంభించారు.

జీవన నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రచయిత జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు బాలబాలికల గ్రంథాలయ ఆధ్వర్యంలో వేసవి శిక్షణలో భాగంగా గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాంకులు మాత్రమే జీవితం అంటూ బాహ్య ప్రపంచాన్ని మరిచి పోతున్నారన్నారు. నైతిక విలువలు పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులకు పనుల్లో తోడ్పాటు అందించాలని, ఇతరులతో కలిసి మెలిసి జీవించాలని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత వైమానిక దళాధికారి కొండయ్య, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే



పిల్లలు, తల్లితో మాట్లాడుతున్న ఉపాధ్యాయిని మహేశ్వరి

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే నిర్వహించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తున్నట్లు సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు మహేశ్వరి, రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈ పిల్లల కోసం ఇంటింటి సర్వే చేస్తూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు ఉంటుందని, సర్వేలో గుర్తించిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వాటి ఉపయోగాల గురించి చెబుతున్నామన్నారు. అలాగే భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరఫి, బోధన, బోధనేతర అంశాలను వివరిస్తున్నామన్నారు.

కౌమారదశపై అవగాహన ఉండాలి

వేంపల్లె : రుతుక్రమం అనేది మహిళ శరీరంలో జరిగే సహజ ప్రక్రియ అని దీనిపై కౌమార దశ బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న సూచించారు. వేంపల్లె మండలం నందిపల్లె గ్రామంలో మహిళలకు, బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమం పట్ల ఉన్న మూఢనమ్మకాలను, అపోహలను వీడనాడాలన్నారు. అవగాహన లేకపోవడంతో చాలామంది నిరుపేద పిల్లలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. ఋతుస్రావం సమయంలో మహిళలు పరిశుభ్రతను పాటించాలని అలాగే రుతుక్రమం గురించి పలు జాగ్రత్తలను గురించి మహిళలకు వివరించారు. అదేవిధంగా ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగహింస, లింగ నిష్పత్తిని గురించి కూడా వారికి తెలియజేశారు. అనంతరం గ్రామంలో బాలికలు, మహిళలతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు.అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరత్న, ఏఎన్ఎం నాగస్వర్ణ పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



ప్రొద్దుటూరు: నినాదాలు చేస్తున్న నాయకులు



పోరుమామిళ్ల: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



బద్వేలు అర్బన్ : జెండా ఎగురవేస్తున్న నేతలు

ప్రొద్దుటూరు : స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ కుమార్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాణి, సుబ్బలక్ష్మి, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, మెడికల్ రెప్స్ యూనియన్ కార్యదర్శి రామలింగారెడ్డి, అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ అధ్యక్షురాలు సర్వేశ్వరి, బాబు, చెన్నారెడ్డి, రాఘవ, రవి, మోహన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సమగ్ర చట్టం చేసే వరకు పోరాటాలు

బద్వేలు అర్బన్ : అసంఘటిత రంగ కార్మికులకు శాశ్వత సమగ్ర చట్టం చేసేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కో కన్వీనర్ కొండయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, అనుబంధ కార్మిక సంఘాలనాయకులు ప్రవీణ్, మల్లికార్జున, చంద్ర, ఫాతిమా, మాధవి పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యుత్ కార్యాలయం వద్ద జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకొంటూ సీఐటీయూ కార్మికవర్గ సంస్థగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, రవి, కిశోర్, ఖాజావలి, రంతున్నీ, వెంకటసుబ్బమ్మ, లక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు.